ఆంధ్రప్రభ, ఫిబ్రవరి 17, 2001

"వరదనీటి ప్రవాహంలో చందన వృక్షాలూ, విషసర్పాలూ ఉంటాయి. నదికి తానేం మోస్తున్నదీ తెలియదు. నీ వాక్ప్రవాహమూ అంతే!" అన్నాడు శేఖర్ భార్యతో-"

# ఆడియో వీడియో

కొత్త మురిపెం పొద్దెరుగదని చెప్పడానికి సామెతలున్నాయి. సినిమా పాటలున్నాయి. నేనూ మా వారూ కూడా ఉన్నాం.

మా పెళ్ళై రెండేళ్ళయింది. ఇంకా రెండేళ్ళే అయిందంటారు శ్రీవారు. క్షణం కూడా నన్ను విడిచి ఉండలేక ఆయన ఆఫీసుకు మొద్దబ్బాయిలా ఏడుపు ముఖంతో వెడతారు. ఆఫీసు నుంచి పూలరంగడిలా ఇంత మొహం చేసుకుని వస్తారు. దగ్గరున్నంతసేపూ ఏవో చిలిపి పనులు చేస్తూనే ఉంటారు. విసుక్కుంటే చిన్నబుచ్చుకుంటారు. విసుక్కోకపోతే రెచ్చిపోతారు.

'అతి సర్వత్ర వర్జయేత్' అని చాలాసార్లే వారికి చెప్పాను.

'ఇంట్లో మనిద్దరమే ఉంటే నా మనసూరుకోదు. నువ్వు నా పక్క నుండగా నేను నా మనసుకు బానిసను' అంటారు వారు.

'అతి సర్వత్ర వర్జయేత్' అని చాలామంది నాకూ చెప్పారు. వారిలో అసూయ పరులూ, శ్రేయోభిలాషులూ కూడా ఉన్నారు.

'ఆడదాని అనురాగం మహాసముద్రమంత. దానికి తరుగుండదు. మగాడి మోజుకు పరిమితి ఉంటుంది. కొంచెం కొంచెం తీసుకుంటే చాన్నాళ్లు. లేకుంటే అంతా మూన్నాళ్ళ ముచ్చట' అంటూ అయినవాళ్ళు కూడా నన్ను హెచ్చరించారు.

అస్తమానూ ఇంట్లో ఉంటే ఏకాంతమని పార్కుకూ, సినిమాలకూ, షికార్లకూ వెళ్ళేవాళ్ళం. కానీ ఎంత వద్దనుకున్నా వాటివల్ల ఖర్చు పెరుగుతుంది. మధ్య తరగతి వాళ్ళం మధ్యేమార్గంగా ఏ సోషల్ విజిట్సో ఎన్నుకోక తప్పదు. ఎటొచ్చీ నాకూ శ్రీవారికీ కూడా కబుర్లు చెప్పడం బోరు. వినడానికి అభ్యంతరం లేదు కానీ పది నిముషాలు దాటితే అదీ బోరు.

పెళ్ళైన కొత్తలో చాలామంది యీ యింటికొచ్చి పరిచయాలు చేసుకుని తమ

ఇళ్ళకు ఆహ్వానాలందజేసి మరీ వెళ్ళారు. రాకపోకల నక్కడితో త్రుంచేయడమే మంచిదని మేమా ఆహ్వానాలను మన్నించలేదు. నేను ప్రయివేటుకు ఎమ్మే కడుతున్నానని చెప్పి మా వీధిలో ఆడవాళ్ళతో అట్టే కలిసేదాన్ని కాదు. రెండేళ్ళలో ఎమ్మే పూర్తి చేసాక పగలు తీరుబడి వచ్చి నాలుగిళ్ళ వాళ్ళతో కాస్త మసిలేసరికి అంతా ఎంతో మంచివారనీ ఉత్త పుణ్యాన సాంఘిక జీవనాన్ని మిస్సవుతున్నాననీ బాధ కలిగింది.

సోషల్ విజిట్సు ప్రారంభించాలని శ్రీవారిమీద ఒత్తిడి తేగా ఆయన, 'దూరపు కొండలు నునుపు' అని హెచ్చరించారు. కానీ దగ్గరుంటే ఆయనకు ఎత్తు పల్లాలు తప్ప మరో దృష్టి ఉండడంలేదని నే నా హెచ్చరికను పట్టించుకోలేదు. ప్రథమ ప్రయత్నంగా శేఖర్ ఇంటికి వెళ్ళాం.

శేఖర్ భార్య విశాలాక్షిది మాటకచేరీలో గిన్నెస్ బుక్ స్థాయి అని అంతా చెప్పుకుంటారు. పరమ శివుడు లింగాకృతిని దాల్చినపుడు ఆద్యంతాలు తెలుసుకొనడంలో బ్రహ్మ, విష్ణువు ఎలా విఫలమయ్యారో తెలుసుకోగోరిన వారామె మాట కచేరికి వెడితే చాలంటారు. తనకంటే పదిహేనేళ్ళు పెద్దైన శేఖర్‌తో మా వారికి పరిచయమెలాగయిందో తెలియదు కానీ చాలాకాలంగా ఆయన మమ్మల్ని తమ యింటికి ఆహ్వానిస్తున్నాడు.

మేము వెళ్ళేసరికి ఇంటి తలుపులు తెరిచే వున్నాయి. అక్కడ సోఫాలో కూర్చుని ఉన్న నడి వయస్కుడు మమ్మల్ని చూడగానే చటుక్కున లేచి నిలబడి ఆత్మబంధువుని చూసినట్లు నవ్వాడు. ఆ నవ్వుకు రెస్పాన్సివ్వడానికి, 'మిమ్మల్నెక్కడో చూసినట్లుంది' అన్నారు శ్రీవారు.

'చూసి ఉండరు. కానీ ఇక ముందు చూసుకుంటుంటాం. మీ కార్డుంటే ఇవ్వండి' అన్నాడాయన. శ్రీవారికి కార్డు లేదు. అందుకని ఆయనకు మా యింటి చిరునామా చెప్పి, 'మీ కార్డిస్తారా' అనడిగారు మర్యాదకు.

'ఇవ్వను' అంటూ ఆయన బైటకు నడుస్తూంటే విశాలాక్షి కంగారుగా, 'అయ్యో మీకు సోమయాజులు గారింటి చిరునామా చెప్పనేలేదు' అంది.

'చెప్పారు' అంటూ ఆయన అక్కణ్ణుంచి క్షణాలమీద మాయమయ్యాడు.

'సోమయాజులు గారెవరో కూడా మనకు తెలియదు కదా... ఆ యింటి చిరునామా నేనెలా చెప్పాను?' అంది విశాలాక్షి ఆశ్చర్యంగా.

'వరదనీటి ప్రవాహంలో చందన వృక్షాలూ, విష సర్పాలూ ఉంటాయి. లబ్ది పొందేవారు కొందరు. భయపడేవారు కొందరు. నదికి తానేం మోస్తున్నదీ తెలియదు. నీ వాక్ప్రవాహమూ అంతే. నువ్వాయనకు సోమయాజులుగారి చిరునామా చెప్పే ఉంటావు' అన్నాడు శేఖర్.

విశాలాక్షి వెంటనే, 'నిజమేనేమో, టెన్తుక్లాసు స్టూడెంటోసారి నాతో అరగంట మాట్లాడి పైథాగరస్ సిద్ధాంతం అర్థమైందని వెళ్ళాడు. ఓ సంగీత విద్వాంసుడు అన్నమయ్య పాటకు కొటేషన్స్ దొరికాయన్నాడు...' అంటూ ఊపిరి పీల్చుకునేందుకు ఆగింది. అప్పుడు శేఖర్ అందుకుని, 'నీతో మాట్లాడాకనే కదా నా మిత్రుడు చలపతి ఈ భూమ్మీద మన

దేశానికి అన్నింటికన్నా దూరమని అమెరికా వెళ్ళిపోయాడు. నా తమ్ముడు పిలిచాడని వెళ్ళి మనం అమెరికాలో ఉన్నప్పుడే బిల్‌గేట్సూ, బిల్ క్లింటనూ కూడా ఇండియా వచ్చేశారు. ఆ చారిత్రాత్మక సంఘటనల్లో మా ఆవిడ పాత్రకి బదులు చంద్రబాబూ, వాజ్‌పేయీలకి గుర్తింపు రావడం మన దేశంలో జరుగుతున్న అన్యాయాలకు అద్దం పడుతోంది...' అంటూ మా వైపు తిరిగాడు.

అంతా గజిబిజిగా ఉంది నాకు. శ్రీవారు మాత్రం, 'చలపతి ఎవరూ?' అన్నారు. 'చలపతి తెలియదూ మీకు? పోనీ పాండురంగం తెలుసా అంటే వీరభద్రం ఇంటి పక్కన...' అంటూ విశాలాక్షి ఓ ఇరవై మందిని రిఫర్ చేసి చివరకు ఓ పద్మరాజు దగ్గర ఆగి, 'మీకు తెలియకపోతే కనుక పద్మరాజు గురించి తెలుసుకోవలసిందే' అంది.

'పద్మరాజు నా క్కూడా కొత్తపేరు...' అన్నాడు శేఖర్.

విశాలాక్షి విజృంభించింది. పద్మరాజుకు ఇంగ్లీషు సినిమాలే ఇష్టం. వార పత్రికలన్నీ చదువుతాడు. టీవీలో దూరదర్శన్ తప్ప ఇతర ఛానెల్సు పెట్టించుకోలేదు. చారులో ఇంగువ పోపు ఇష్టపడతాడు.

ఆ పద్మరాజు గురించి నేనెందుకు తెలుసుకోవాలో అర్థం కాక, 'ఆయన మీకేమవుతాడు?' అంటూ ఆ వాక్ప్రవాహాన్ని అడ్డుకునే చిన్న ప్రయత్నం చేశాను.

'అయ్యో అదొక్కటే గుర్తుకు రావడం లేదు. ప్రతాప్ గురించైతే అన్నీ చెప్పగలను. ఆయన మా పిన్ని కూతురి మామగారి పెద్దనాన్నకు రెండో కొడుకు, చూశారా ఎంత బాగా గుర్తుందో నా జ్ఞాపక శక్తి అంటే మాటలా మరి..." అంటూ తన జ్ఞాపకశక్తి మీదకు టాపిక్ మళ్ళించిందావిడ.

ఈలోగా వారింటి వంటమనిషి కాబోలు అలా వచ్చి 'అందరికీ టీలు తెచ్చేదా, లేక భోజనాలు వడ్డించేదా?' అంది.

'టీలు, భోజనాలయ్యేక డైనింగు టేబులు సర్దు' అని వంటామెను పంపేసిందావిడ. అదే అదననుకుని శ్రీవారు వాచీ చూసి, 'మరి మాకు సెలవా?' అన్నారు.

'మా యింట్లో రోజుకి అదనంగా కనీసం రెండు కంచాలైనా లేవాలి. రాక రాక వచ్చారు. భోంచేయకుండా మిమ్మల్ని వదలం. ప్రకాష్ గురించి చెప్పడం అవగానే మనం భోజనాలకు లేద్దాం' అందావిడ. మన సంభాషణలో ఎక్కడా ప్రకాష్ ప్రసక్తి వచ్చినట్లు లేదు - అన్నారు శ్రీవారు. ఎంత ప్రయత్నించారో కానీ కంటికి రాకుండా ఆపిన నీటికి గొంతు తడిసినట్లుంది.

గ్రామర్ మిస్టేక్. మా శ్రీమతి మాట్లాడుతూండగా మన సంభాషణ అని ఇంకెవరైనా అంటే అది మన భార్య అనడమంత తప్పు" వ్యాఖ్యానించాడు శేఖర్.

"అబ్బ - ఊరుకోండి. నేను మాట్లాడుతూంటే ఊరికే అడ్డొస్తారు" అందావిడ.

'నీది మాట కచేరి. నాది తంబుర నాదం. నేను నిన్నాపను. నువ్వు నన్నాప కూడదు...'

'అబ్బ మీదీ ప్రకాష్‌దీ ఒకటే పద్ధతి' అంటూ ప్రారంభించింది విశాలాక్షి. ప్రకాష్‌కి

వయసు యాభై దాటినా రోజూ నిక్కరు వేసుకుని పొద్దున్నే వీధుల్లో జాగింగ్ చేస్తాడు. అందరూ పప్పులో నంజుకునే చల్ల మిరపకాయను అతడు పులుసులో నంజుకుంటాడు. అందరూ కుక్కల్ని పెంచితే తను పిల్లిని పెంచుతున్నాడు. ఉబ్బసం రోగమున్నా ఒక్కసారీ మందు వేసుకోడు...

ప్రకాష్ గురించి తెలుసుకుని ఏం చేయాలా అని ఆలోచిస్తుండగా ఇంట్లోకి ఓ యువకుడు ప్రవేశించాడు. అతణ్ణి చూడగానే ఆత్మీయుణ్ణి చూసినంత ఆనందం కలిగింది నాకూ, శ్రీవారికీ...

'మిమ్మల్నెక్కడో చూసినట్లుంది' అన్నాడా యువకుడు. మా ముఖభావాలకు తడబడుతూ.

అతడికి బదులివ్వకుండా నేను, శ్రీవారు లేచి నిలబడి 'సడెన్‌గా గుర్తుకొచ్చింది. మా ఇంటికి భోజనానికి గెస్టులొస్తారు. అది మరచి ఇక్కడుండి పోయాం' అన్నాం కోరస్‌లో. ముందుగా సంప్రదించుకోకుండా మా మాటల్లో అంత సింక్రొనైజేషన్ ఎలా వచ్చిందో నాకు ఆశ్చర్యమే!

'బోసుబాబుగారిల్లెక్కడో చెబుతారా?' అడిగేడాయువకుడు.

'చెబుతాను. రా, కూర్చో బాబూ!' అంది విశాలాక్షి.

శేఖర్ మమ్మల్నాపడానికి, 'అదనంగా కనీసం రెండు కంచాలు వేస్తే కాని మా ఆవిడకు తోచదే' అన్నాడు కానీ శ్రీవారు, 'ఈరోజుకు ఓ కంచంతోనే సరిపెట్టుకోండి' అని విశాలాక్షి వంక చూశారు వీడ్కోలు కోసం. ఆవిడ ఆ యువకుడికి ఎవరో డేవిడ్ గురించి చెబుతోంది. డేవిడ్ గురించి తెలుసుకోకుండా ఆవిడనుంచి వీడ్కోలు సాధ్యం కాదని గ్రహించిన వారమై శేఖర్‌తో సరిపెట్టుకుని బయటపడ్డాం.

మేమిలా సందు మలుపు తిరిగామో, లేదో అక్కడ మాకు ఇందాకా ఆ యింటి నుంచి బయటపడ్డాయన కనిపించాడు. మమ్మల్ని చూస్తూనే ఇంత ముఖం చేసుకుని, 'సోమయాజులు ఇంటికోసం అడిగి అక్కడ దొరికిపోయాను. మీరు వచ్చి రక్షించారు. మీకు ప్రత్యుపకారం చేయడంకోసం ఓ యువకుణ్ణి పట్టి అక్కడకు పంపాను. అతగాడు ఉద్యోగానికింటర్వ్యూకని వచ్చి హోటల్లో దిగడానికి డబ్బు చాలక సామాను రైల్వే స్టేషన్ క్లాక్ రూంలో పెట్టి తనేమో రోడ్లు పట్టి తిరుగుతున్నాడు. ఇప్పుడిక ఈ రాత్రికి భోజనం, కాలక్షేపం అన్నీ ఏర్పాటైనట్టే...' అన్నాడు.

'కానీ ఎవరో బోసుబాబు గారిల్లు కావాలంటూ అడిగాడు...' నసిగారు శ్రీవారు.

'బోసుబాబు ఎవరో కాదు. అతడే... ఉద్యోగం దొరికేదాకా అతడి ఇల్లు అతడికే తెలియదుగా...' అని వివరాలు తెలుసుకుని, 'కాలక్షేపానికి ఎక్కడికో ఎందుకు. రేపు మా యింటికి రండి. మా ఆవిడ మితభాషి. మీకేం బాధ కలుగదు' అన్నాడు.

'కానీ, ఇందాకా మీ కార్డడిగితేనే ఇవ్వనన్నారు...' అన్నారు శ్రీవారు నిష్ఠూరంగా.

'అక్కడైతే మీకిచ్చానని వాళ్ళకూ ఇవ్వాలిగా. ఆ యింట్లో నాకు సంబంధించిన వివరాలు వదలడమే... అమ్మో' అంటూ ఆయన జేబులోంచి తన కార్డు తీసి మాకిచ్చి

వెళ్ళిపోయాడు.

ఆయన యిల్లు మాకు కాస్త దూరమే. బస్సులో వెడితే ముప్పావుగంట. రిక్షాలో వెడితే అరగంట. మర్నాడు మే మాయన ఇంటికి రిక్షాలో వెళ్ళాం.

మేము వెళ్ళేసరికి ఆయన, భార్య మా కోసం ఎదురుచూస్తున్నారు. వాళ్ళకిద్దరు పిల్లలు. ఇద్దరూ బోర్డింగ్ స్కూల్లో ఉన్నారు. ఈరోజాయన బంధువొకరికి ఆపరేషనై ఆసుపత్రిలో ఉన్నాడు.

'మగాళ్ళ మిద్దరం వెళ్ళి వచ్చేద్దాం. నేను మీకీ ప్రాంతమంతా పరిచయం చేస్తాను. మనం వచ్చేదాక ఆడాళ్ళు కబుర్లు చెప్పుకుంటారు' అన్నాడాయన మా రాకకు పుణ్యాన్నీ పురుషార్థాన్నీ కలగలుపుతూ.

ఆయనకు స్కూటరుంది. మగాళ్ళిద్దరూ దానిమీద వెళ్ళారు. ఆడవాళ్ళం సంభాషణ ప్రారంభించాం. ముందు నేనావిడ పేరడిగాను. రాజ్యం అని చెప్పి, నా పేరడిగింది. నేను నా పేరు చెప్పాను.

ఇద్దరికీ మాటలాగిపోయాయి. కాసేపు చూసి నేనావిడ పుట్టింటి వివరాలడిగాను. అయిదారు పేర్లు, వివరాలు చెప్పి నా పుట్టింటి వివరాలడిగింది. నేనూ ఆవిడకు అలాగే చెప్పాను.

మళ్ళీ మాటలాగిపోయాయి. నిశ్శబ్దాన్ని భంగం చేయడానికి, 'దగ్గర్లో కూరలు దొరుకుతాయా?'అన్నాను. దొరుకుతాయని, 'మీకు?' అంది.

దొరుకుతాయన్నాను.

మళ్ళీ నిశ్శబ్దం... నేను ఎంతో ఆలోచించి ప్రశ్నని సృష్టిస్తుంటే అది పీచు మిఠాయిలా ఇట్టే కరిగిపోయి నా సృజనాత్మక శక్తిని సవాలు చేస్తోంది.

పట్టుమని పావుగంట గడవలేదు. పాతిక ప్రశ్నలైపోయాయి. కొత్త ప్రశ్నలకోసం నేను కౌన్‌బనేగా కరోర్ పతీని గుర్తు చేసుకోసాగాను. ఆవిడైతే అదీ చేయడం లేదు. నా ప్రశ్నకోసం ఎదురుచూస్తూ నా ముఖాన్నే చూస్తోంది. ఆ విషయం తెలుస్తున్నా మధ్య మధ్య నేనూ ఆవిణ్ణి సూటిగా చూస్తున్నాను. చూపులు కలవగానే ఆవిడ ఇహ్హిహ్హి అని నవ్వుతోంది. నేనూ ఇహ్హిహ్హి అంటున్నాను.

'మీరు టీవీ చూస్తుంటారా?' అని ఓ కొత్త ప్రశ్న వేస్తే ఊ అని ఊరుకుందావిడ. చివరకు నోరు విడిచి టీవీ పెట్టమన్నాను. రిపేర్లో ఉందంది. సంభాషణ మళ్ళీ ఆగిపోయింది.

ఎంతసేపని ముఖముఖాలు చూసుకుని ఇహ్హిహ్హి అనుకుంటాం. నేనెప్పుడూ పేపరు చదవకపోయినా టీపాయ్ మీద కనబడ్డ ఆ రోజు పేపర్ తీసి, 'మీరు పేపర్ చదువుతారా?' అన్నాను.

'చదవను' అని ఊరుకుందావిడ. అప్పుడు నాకు పేపరుకింద ఫొటో ఆల్బం ఒకటి కనబడింది.

ప్రాణం లేచివచ్చినట్లై 'ఫ్యామిలీ ఆల్బమా!' అన్నాను.

'అవును. మీరు ఆల్బమ్ చూస్తారా?' అందావిడ ఆశ్చర్యంగా.

ఆశ్చర్యమెందుకో అప్పుడు నాకు అర్థం కాలేదు. అయినా వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోలేక 'ఊ' అన్నాను.

అంతే - ఆవిడ ఉత్సాహంతో వచ్చి సోఫాలో నా పక్కన కూర్చుంది. ఆల్బంలో మొత్తం ముప్పై రెండు పుటలున్నాయి. పెద్దా చిన్నా అన్నీ కలుపుకుని యాభైకి తక్కువ కాకుండా ఫొటోలున్నాయి. ఫొటోకి నిముషం తక్కువ కాకుండా వివరాలు చెబుతూ ఆ అల్బం పూర్తిచేయడానికి పూర్తిగా గంట తీసుకుందావిడ.

ఆవిడ పుట్టింటివారు, ఆయన పుట్టింటివారు పనివాళ్ళతో సహా పేరుపేరునా నాకు పరిచయం కాసాగారు. ఆల్బమ్స్ వస్తున్నాయి. వెడుతున్నాయి.

రాజ్యం భర్త, శ్రీవారు వచ్చేసరికి రాత్రి తొమ్మిది దాటిపోయింది. వాళ్ళు దారిలో హోటల్నుంచి క్యారియర్ తెచ్చారు. అంతా కలిసి భోంచేశాం. వీడ్కోలు తీసుకునే ముందు మేమా దంపతులను మా యింటికాహ్వానించాం.

ఇల్లు చేరాక శ్రీవారికి నా అనుభవం చెప్పి, 'విశాలాక్షి ఇంట్లో ఆడియో అయితే రాజ్యం ఇంట్లో విడియో. రెండూ మాట కచేరీలే' అన్నాను.

'విశాలాక్షి గారి టాలెంటు అందరికీ రాదు. రాజ్యంగారి పద్ధతి మనమూ ట్రై చేయవచ్చు. ఇంటికెవరొచ్చినా ఎలా ఎంగేజ్ చెయ్యాలన్న బాధ లేకుండా మనమూ మన ఫొటోలను ఆల్బమ్స్‌లో సర్దేద్దాం' అన్నారు శ్రీవారు.

ఈ నిర్ణయానికొచ్చేక మేము ఎంతో కాలంగా వాయిదావేస్తున్న పిలుపును శ్రీవారి స్నేహితుడు ముకుందరావుకు అందజేశాం. అదే రోజున శేఖర్ ఇంటికి పిలుపుందనీ విశాలాక్షి మాట కచేరీ ధాటినుంచి తప్పించుకుందుకు మా పిలుపు నుపయోగించు కుంటాననీ ముకుందరావు అన్నాడు.

రేపు ముకుందరావు వస్తాడనగా ఈరోజు ఆల్బమ్స్ కొనడానికి నేనూ, శ్రీవారూ ఓ షాపుకు వెళ్ళి కొన్ని ఆల్బమ్స్ సెలక్ట్ చేశాం. అక్కడ అనుకోకుండా ముకుందరావు దంపతులు కనబడ్డారు. మా చేతుల్లో కొత్త ఆల్బమ్స్ చూసిన ముకుందరావు దంపతులు కంగారుగా పక్కకు వెళ్ళి ఏదో మాట్లాడుకుని మళ్ళీ మా దగ్గరకు వచ్చారు. 'సారీ బ్రదర్! ఏమీ అనుకోకు. ముందుగా పిలిచిన శేఖర్‌గారింటికి వెళ్ళకపోతే బాగుండదని మా ఆవిడ అంటోంది. మీ యింటికింకోసారి వస్తాం' అన్నాడు ముకుందరావు.

వాళ్ళు వెళ్ళేక 'కచేరీకి వెళ్ళడం తప్పనిసరైనప్పుడు ఎవరైనా సరే విడియో కంటే ఆడియోనే ప్రిఫర్ చేస్తార్లే' అని నిట్టూర్చారు శ్రీవారు.

సోషల్ విజిట్సు విషయంలో పునరాలోచన అవసరమని అప్పుడు నాకు అనిపించింది.

✦ ✦ ✦